
andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
శుక్రవారం 12 సెప్టెంబరు 2025




సిరన్‌పల్లి బస్టాండ్‌లో ఇందిరమ్మ లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

'ఇందిరమ్మ' లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- సిరన్‌పల్లిలో ఇందిరమ్మ లబ్ధిదారులతో భేటీ
- ఎంపీడీవో, రెవెన్యూ కార్యాలయాల సందర్శన

నవీపేట,సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లింపులు జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని సిరన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను కలిసి ఇంటి నిర్మాణాలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. గ్రామంలో 93మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 69 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని ఇందులో 12ఇళ్లు స్లాబ్ దశలో ఉన్నాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మిగతా 24మంది ఇళ్లను నిర్మించుకునేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారులకు సెర్ప్ ద్వారా రుణాలు మంజూరయ్యేలా చొరవ చూపాలన్నారు. ఉచిత ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, కేవలం రవాణా, కూలీల వేతనాలు మాత్రమే లబ్ధిదారులు చెల్లిస్తే ఇసుక ఉచితంగా సమకూర్చుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇదే సమయంలో భారీ వర్షం కురియడంతో కలెక్టర్ స్థానిక బస్టాండ్‌లోనే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయాలను కలెక్టర్ సందర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై కలెక్టర్ సమీక్ష జరిపారు. సాదాబైనామా అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలని, త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ వెంకట రమణను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పవన్ కుమార్, ఎంపీడీవో నాగనాథ్, సిరన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి సాయిలు ఉన్నారు.


సాదాబైనామాలకు అడ్డంకులు తొలిగాయి. ఐదున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల నిరీక్షణకు తెరపడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో తీసుకువచ్చిన 112జీవో స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకరావటంతో పాటు ప్రభుత్వం సాదాబైనామాల పరిష్కారంపై విధివిధానాలను హైకోర్టుకు సమర్పించింది. దీంతో హైకోర్టు తన ముందు ఉన్న పిల్‌ను కొట్టివేసింది. ప్రభుత్వం సాదా బైనామాల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 2020 నుంచి జిల్లా వ్యాప్తంగా జిల్లాలో 9,185 సాదాబైనామా, 9,233 పీవోటీ దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, కొత్తగా ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లోనూ భారీగా సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా హైకోర్టు గ్రీన్‌సిగ్నల్‌తో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాదాబైనామాలకు మోక్షం కలుగుతుందనే ఆనందంలో రైతులు ఉన్నారు.



- హైకోర్టు తీర్పుతో క్రమబద్ధీకరణకు మార్గం సుగమం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో తెచ్చిన జీవో 112పై హైకోర్టులో కేసు
- పాత చట్టం స్థానంలో కొత్తగా భూ భారతిచట్టం రావటంతో తొలిగిన అడ్డంకులు
- క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం అర్హులకు పట్టాదార్ పాస్‌బుక్‌లు
- భూ భారతి సదస్సుల్లో భారీగా దరఖాస్తులు
- జిల్లాలో 9,185 సాదాబైనామా, 9,233 పీవోటీ దరఖాస్తులు

సాదా బైనామాలకు రైట్.. రైట్..

ఐదున్నరేళ్ల రైతుల ఎదురుచూపులకు తెర


మాక్లూర్ మండలం మాందాపూర్‌లో సాదాబైనామా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఆర్ఐ షఫీ

నిజామాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సాదాబైనామా దరఖాస్తులకు త్వరలోనే మోక్షం లభించనుంది. ఐదేళ్లకు పైగా సాదాబైనామా దరఖాస్తు చేసుకున్న రైతులు వాటిని క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తుండగా హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు పరిష్కారం లభించే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో సాదా బైనామా దరఖాస్తులు చేసుకున్న రైతులు వాటి క్రమబద్ధీకరణ కోసం ఎదురు చూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో తీసుకువచ్చిన 112 జీవో స్థానంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకురావడంతో పాటు సాదాబైనామాల విషయంలో పరిష్కారాలను ఇటీవల హైకోర్టు ముందు ఉంచగా హైకోర్టు సాదాబైనామాల విషయంలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సాదాబైనామాలు, పీవోటీ భూములకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. జిల్లాలో 9,185 సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులోనూ సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి. అదే విధంగా పీవోటీ (ప్రభుత్వ భూమి క్రమబద్ధీకరణ) దరఖాస్తులు సైతం జిల్లాలో 9,233 పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు తీర్పు నేపథ్యంలో అధికారులు సాదాబైనామా, పీవోటీ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాలలో రెవెన్యూ అధికారులు గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు.

తొమ్మిదేళ్లుగా ఎదురు చూపులు..

రిజిస్ట్రేషన్ చేసుకోకుండా కేవలం తెల్లకాగితం, లేదా బాండ్ పేపర్‌పై భూములు కొన్నవారు వాటిని తమ పేరుమీద చేసుకునేందుకు సాదాబైనామా దరఖాస్తులు చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా భూములు తమ ఆదీనంలో ఉన్న పట్టా పాస్‌పుస్తకంలో ఉండకపోవడంతో

మిగతా 8వ పేజీలో...

క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన..

జిల్లాలో సాదాబైనామా, పీవోటీ దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఉన్న ధరణి పోర్టల్ వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ప్రస్తుత ప్రభుత్వం తీసుకొస్తున్న భూభారతి చట్టం ద్వారా తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల రెవెన్యూ శాఖ అధికారులు వచ్చిన సాదాబైనామా, పీవోటీ దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నారు. గ్రామాలలోని రైతుల భూముల వద్దకు వెళ్లి అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి తహసీల్దార్లకు నివేదికలు ఇవ్వనున్నారు. పంచాయతీ కార్యాలయాల్లో నోటీసు బోర్డులో వివరాలను తెలిపి అభ్యంతరాలను స్వీకరించి అనంతరం అర్హులను గుర్తించి పట్టాపాసుపుస్తకాలను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

టౌన్‌ప్లానింగ్ విభాగం
పనితీరుపై కలెక్టర్ సమీక్ష

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం పనితీరుపై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులతో కలెక్టర్ సమావేశమై నూతన భవన నిర్మాణాలకు అనుమతులు, క్రమబద్ధీకరణ, అక్రమ కట్టడాలపై చేపట్టిన చర్యలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ చెల్లించిన వారికి త్వరితగతిన క్రమబద్ధీకరణ ప్రొసిడింగ్స్ అందించాలన్నారు. సమీక్ష సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, అదనపు కమిషనర్ రవిబాబు, టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.


• నందిపేటలో కురుస్తున్న వర్షం

భారీ వర్షం

- గంటన్నర వ్యవధిలోనే 20 మి.మీ. వాన
- నందిపేటలో జలమయమైన రోడ్లు

నందిపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. వర్షంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వరద వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే నందిపేట మండల కేంద్రంలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. కేవలం గంటన్నర వ్యవధిలోనే 20 మి.మీ. వర్షం కురిసింది. దీంతో తారు రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.



జిల్లాలో ఉగ్ర కలకలం

మూడు నెలలుగా ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసుల రెక్కీ

- పక్కా ఆధారాలతో బోధన్‌లో ఢిల్లీ పోలీసుల తనిఖీలు
- పట్టుబడిన మహమ్మద్ హూజెఫ్ యమన్ బీఫార్మసీ విద్యార్థి
- డ్యానిష్ అనే ఉగ్రవాదితో యమన్ వీడియో కాల్‌లో మాట్లాడినట్టు లభించిన ఆధారాలు

నిజామాబాద్,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని బోధన్ పట్టణంలో ఉగ్రవాద ఆనవాళ్లు మరోసారి కలకలం సృష్టించాయి. బుధవారం బోధన్ పట్టణంలోని అనిషానగర్‌కు చెందిన మహమ్మద్ హూజెఫ్ యమన్ ఢిల్లీ పోలీసులు అదుపులోకి విచారణ కోసం ఢిల్లీకి తీసుకెళ్లిన ఘటన జిల్లాలో చర్చనీయాంశం అయింది. ఈ ఘటన వెనక ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు మూడు నెలలుగా రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది. జార్ఖండ్‌లోని రాంచి పట్టణంలో బాంబుదాడులకు కుట్రలు చేస్తున్న డ్యానిష్ అనే ఉగ్రవాదితో యమన్ వీడియో కాల్‌లో మాట్లాడినట్టు ఆధారాలు లభించడంతో ఢిల్లీకి చెందిన స్పెషల్ సెల్ పోలీసులు బోధన్‌లో అదుపులోకి తీసుకున్నారు. జులాయిగా తిరిగే యమన్ డిచ్‌పల్లి వద్ద ఉన్న తిరుమల నర్సింగ్ కళాశాలలో బీఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కేవలం ఆన్‌లైన్‌లో డ్యానిష్‌తో వీడియో కాల్ మాట్లాడిన విషయం నిజమేనని కుటుంబ సభ్యులు చెబుతున్నారు అతనికి ఉగ్రవాదులతో ఎలాంటి సంబంధాలు లేవని యమన్‌ను విడిచిపెట్టాలని ఆయన తల్లి కోరింది. ఎన్ఐఏ నిఘాలోనూ జిల్లాలో ఇంకా ఉగ్రవాద సానుభూతి పరులు ఉన్నట్లు తేలడంతో ఆ కోణంలో యమన్ నుంచి ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. గురువారం యమన్‌తో పాటు దేశవ్యాప్తంగా అరెస్టు చేసిన వారిని మీడియా ముందు ప్రవేశపెట్టినట్లు సమాచారం. డ్యానిష్‌తో కలిసి యమన్ ఉగ్ర దాడులకు ఏమైనా ప్రణాళిక వేశాడా? లేక ఉగ్రదాడుల్లో యమన్‌ను

మిగతా 8వ పేజీలో...

గోవింద్‌పల్లి చెరువుకు బుంగ

- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టిన గ్రామస్థులు


చెరువు కట్టకు బుంగలు పూడ్చిన దృశ్యం

ధర్పల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవింద్‌పల్లి ఊర చెరువుకు బుంగ పడింది. దీంతో గుర్తించిన గ్రామస్థులు గురువారం యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి బుంగను పూడ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. బుధవారం రాత్రి నుంచి బుంగ నుంచి నీరు బయటకు రావడంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. చెరువు నుంచి నీరు బయటకు ఏ విధంగా వస్తున్నాయో, ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియక ఆందోళనకు గురయ్యారు. గురువారం ఉదయం బుంగను గుర్తించిన గ్రామస్థులు తహసీల్దార్ శాంత ఆధ్వర్యంలో బుంగ పడిన ప్రాంతాన్ని ఇసుక బస్తాలు, మొరంతో గోవింద్‌పల్లి గ్రామస్థులతో పాటు రైతులు మూసేశారు. దీంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

నగరంలో ఆటోవాలాల ఆగడాలు!

- బస్టాండ్ వద్ద బస్సులు లోనికి, బయటకు వెళ్లాలంటే ఇబ్బందులు
- రోడ్డుపైనే ఏర్పాటు చేసిన పలు దుకాణా సముదాయాలు
- ట్రాఫిక్, మున్సిపల్ అధికారులకు విన్నవించినా తప్పని ఇక్కట్లు

8

బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- పేద విద్యార్థులపై నిర్లక్ష్యం తగదు
- పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి
- పేరుకుపోయిన బెస్ట్ అవైలబుల్ స్కీం బకాయిలు



నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యు నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పేరుకుపోయిన బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో బెస్ట్ అవైలబుల్ స్కీం లబ్ధిదారులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకునే బెస్ట్ అవైలబుల్ స్కీంకు సంబంధించిన నిధులను మూడు సంవత్సరాలుగా విడుదల చేయడం లేదని, పేద విద్యార్థుల పైన ప్రభుత్వ నిర్లక్ష్యం తగదన్నారు. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులే పుస్తకాలు, యూనిఫాంలు కొనుక్కుంటున్నారని, బెస్ట్‌అవైలబుల్ స్కీం పాఠశాలుల నిర్వహించలేమని యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నారని అన్నారు. పేదల ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ఎస్సీ విద్యార్థులు చదువుకునే స్కీంకు నిధులు కేటాయించకపోవడం తగదన్నారు. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు చెందిన విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించే లక్ష్యంతో ప్రైవేట్ పాఠశాలలో విద్యను అందిస్తున్నారని, ప్రస్తుతం వాటికి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తూ పెండిగ్ బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జిల్లాలో 9కోట్లకు పైగా పెండింగ్ బిల్లులు ఉన్నాయని, వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, లేనిచో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మనోజ్, సాయికిరణ్, వంశీ, రాజు పాల్గొన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీ

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మానాల మోహన్ రెడ్డి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తలతిక్క మాటలతో ప్రజలను బీజేపీ నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. అసెంబ్లీ లోపల బీజేపీ ఎమ్మెల్యేలు బీసీ బిల్లుకు ఆమోదిస్తున్నామని చెప్తూనే అసెంబ్లీ బయట ఆ పార్టీ ఎంపీలు బీసీ బిల్లు నుంచి మైనారిటీలను తీసేస్తేనే బిల్లుకు ఆమోదం తెలుపుతామని చెప్పడం అనేది బీజేపీ ద్వంద నీతికి నిదర్శనం అని అన్నారు. మైనారిటీలకు బీసీ బిల్లు నుంచి తొలగిస్తే బీసీ బిల్లుకు ఆమోదం తెలుపుతామని బండి సంజయ్, కిషన్ రెడ్డి చెప్పడం చూస్తుంటే వారి అవివేకం బయటపడుతుందని తెలిపారు. కిషన్ రెడ్డి అగ్రకులానికి చెందిన వాడు కాబట్టి బీసీలకు రిజర్వేషన్ రావద్దని చూస్తున్నాడని అన్నారు. ఈ నెల15వ తేదీన కామారెడ్డిలో చరిత్రలో నిలిచిపోయే విధంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ పై బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని, అందులో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు నరేందర్ గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు యాదగిరి, భీంగల్ మండల అధ్యక్షుడు బోదిరే స్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ మహేష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తిప్పిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

బీమ్‌గల్, సెప్టెంబరు, 11(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా అక్రమంగా చర్చిని నిర్మిస్తూ, తమ మనోభావాలను దెబ్బ తీస్తున్న పాస్టర్‌పై చర్యలు తీసుకోవాలని మాల సంఘ సభ్యులు గురువారం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తాత ముత్తాతల తరాల నుండి తాము ఈ కాలనీలో నివసిస్తున్నామని, ఇతర ప్రాంతం నుంచి వచ్చిన పాస్టర్ అక్రమంగా చర్చిని నిర్మిస్తూ ఇతర గ్రామాల నుండి వచ్చే వారితో చర్చిని నిర్వహిస్తూ, తమకు ఆటంకం కలిగించడమే కాకుండా తమపై పెత్తనం చేలాయిస్తూ తాము నివసిస్తున్న ఇండ్ల స్థలాలపై కన్ను వేశాడని ఆరోపించారు. తమ కాలనీ స్థలం


ధర్నా నిర్వహిస్తున్న స్థానికులు

మొత్తం తనదే అని చెప్పు కుంటూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ విషయం పై అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణ పనులు ఆపి తమకు ఆటంకం కలిగిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని లేకుంటే నిరవధిక ధర్నా చేపడతామని ఈసందర్భంగా తెలియజేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్, కమిషనర్ గోపు గంగాదర్, ఎస్సై సందీప్ లు వచ్చి కాలనీ వాసులతో చర్చలు జరిపారు. అక్ర మంగా చర్చి గోడలను నిర్మిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని ఈ విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లామని 15 రోజుల్లో సర్వే నిర్వహించి, న్యాయం చేస్తామని, చర్చి అనుమతి లేకుండా నిర్వ హిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని అధికా రులు హామి ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో పదవ వార్డు మహిళలు, పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కోటగిరి/ఏర్గట్ల/కమ్మర్‌పల్లి,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్‌లో భాగంగా గణితం, సామాన్య శాస్త్రాలపై మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని 19 ప్రాథమిక పాఠశాలల నుంచి 40మంది, జిల్లా పరిషత్ పాఠశాల నుండి 20మంది విద్యార్థులు క్విజ్ పోటీలలో పాల్గొన్నారు. ప్రాథమిక పాఠశాల నుంచి మండల టాపర్‌గా రచ్చగల్లీ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని సోమ అద్విక్, కేజీబీవీ పాఠశాల నుంచి శివాని మండల టాపర్‌లుగా నిలిచారు. చిన్ననాటి నుంచే చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో శ్రీనివాస్ రావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీ నర్సింలు, ఉపాధ్యాయులు ఉదయ్ చందర్, ఈర్వంత్, భూపేందర్ తదితరులు పాల్గొన్నారు. ఏర్గట్ల విద్యార్థిని వైష్ణవి, ప్రాథమిక విభాగంలో ఎంపీపీఎస్ బట్టాపూర్ ఐదోతరగతి విద్యార్థిని సాధ్య మొదటి బహుమతి గెలు పొం దారు.గెలిచిన విద్యార్థులకు ఎంఈవో ఆనందర్‌రావు బహుమతుల ప్రదానం చేశారు. కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాల స్థాయిలో సీహెచ్ మధుప్రియ,శ్రీలాస్య జడ్పిహెచ్ఎస్ కమ్మర్ పల్లి, అభియాన్ జడ్పీహెచ్ఎస్ కోనాసముందర్,స్థాయిలోమహావీర్ ప్రథమ ఎంపీఎస్‌కోనాసముందర్,సాధ్య ఎంపీఎస్ హసాకొత్తూర్,గెలుచుకున్నారు. ఈకార్యక్రమంలోఎంఈవోఆంధ్రయ్య,హెచ్ఎం,ఆర్పీలు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి , వ్యాపార లైసున్సును తీసుకోవాలి

ఎడపల్లి,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):ప్రతీ ఒక్కరు వృత్తి వ్యాపార లైసెన్సును తప్పక తీసుకోవాలని బోధన్ డీఎల్‌పీవో నాగరాజు అన్నారు. గురువారం ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలో వ్యా పార దుకాణ సముదాయాల నిర్వాహకులకు నోటీసులను అందజేశారు. వ్యాపార లైసెన్సును సిటిజన్ సర్వీస్‌ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల న్నా రు. ఈకార్యక్రమంలో ఆయన వెంట కార్యదర్శి సందీప్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సుల వితరణ

వేల్పూర్ ,సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): పచ్చల నడ్కుడ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన క్రీడాకారులకు స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. ఈ నెల 17, 18 ,19 తేదీలలో జరుగబోయే మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాల సందర్భంగా క్రీడాకారులకు దుస్తువులను వీడీసీ సభ్యులు హెచ్ఎం రమేష్‌కుమార్‌కు అందజేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం వీడీసీలు ఉన్నారు.

ఎరువులను వెంటనే సరఫరా చేయాలి

పెర్కిట్, సెప్టెంబరు, 11(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ సత్యనారాయణకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన కోట ప్రకారం యూరియా, ఎరువులను వెంటనే సరఫరా చేయాలని వినతి పత్రం ద్వారా తెలియజేశారు. రాష్ట్రంలో వర్షాలు సకాలంలో రావడంతో చెరువులు, జలాశయాలు నిండి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పల్లపు వెంకటేష్, భూమన్న, సాయిలు, రవి, ఎల్లయ్య, దాసు, తదిత రులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

డొంకేశ్వర్/వేల్పూర్/ఏర్గట్ల/కోటగిరి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం హర్షనీయమని ఎంఈఓ రామకృష్ణ అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన వారిని గురువారం సన్మానించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

ఎంపిక కావడం మండలానికి గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు రాజేశ్వర్, ప్రధానోపాధ్యాయులు సురేష్ కుమార్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన తెలుగు భాషోపాధ్యాయుల సమావేశంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న కుకునూర్ పాఠశాలకు తెలుగు ఉపాధ్యాయుడు పతాని గంగాధర్‌ను శాలువ, మెమెంటుతో సత్కరించారు. వేల్పూర్ కాంప్లెక్స్ హెచ్ఎం రాజన్న వేల్పూర్, భీమ్‌గల్ మండలాలకు చెందిన తెలుగు భాషోపాధ్యాయులు పతాని గంగాదర్‌ను సత్కరించారుఏర్గట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు గాండ్ల రాజశేఖర్ జిల్లా ఉత్తమ ఉపాధ్యా యునిగా ఎంపికైనందు గాను గురువారం పాఠశాల తరపున ఉపాధ్యాయులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రవీణ్ శర్మ ప్రసాద్, రాజనర్సయ్య, నరేష్, జ్యోతి పాల్గొన్నారు. పోతంగల్ మండలంలోని కొడిచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తున్న వంశీ ఉపాధ్యాయుడు మండల ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. పాఠశాలలో బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఆయనతో పాటు మిగత ఉపాధ్యాయుల కృషి మరువలేనిదని కొనియాడారు.

ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరి దుర్మరణం

● బికినెల్లిలో విషాదచాయలు


అదుపు తప్పి బోల్తా పడిన ట్రాక్టర్

బోధన్,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గ్రామంలో విద్యుత్ సమస్య తలెత్తడంతో ఆ సమస్యను పరిష్కరించేందుకు గాను విద్యుత్ స్తంభాల కోసం వెళ్లిన ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బికినెల్లి గ్రామంలో విషాదచాయలు నింపింది. వివరాల్లోకి వెళితే బోధన్ మండలం బికినెల్లి గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికులు బగారే బాలాజీ(38), బగారే యాదు(36) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బికినెల్లి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో బాలాజీ, యాదు, రాజు అనే ముగ్గురు వ్యక్తులు కల్దుర్కి గ్రామ సబ్ స్టేషన్‌కు వెళ్లారు. ట్రాక్టర్‌లో విద్యుత్ స్తంభాలు వేసుకుని తిరిగి వస్తుండగా సిద్దాపూర్ గ్రామం వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాలీలో కూర్చున్న యాదు, బాలాజీలపై విద్యుత్ స్తంభాలు పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు.ట్రాక్టర్ డ్రైవర్‌రాజు తీవ్రగాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి 108,,పోలీసులకు సమాచారం అందించారు. తీవ్ర గాయాల పాలైన రాజును చికిత్స నిమిత్తం బోధన్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతదూహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌ఏరియా ఆసుపత్రికి తరలించిపోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటన స్థలం హృదయ విదారకరంగా మారింది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరుకార్మికులు మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి. మృతులకుటుంబ సభ్యుల రోదనలుమిన్నంటాయి.

రెజ్లింగ్‌లో అనిత ప్రతిభ

భీమ్‌గల్ , సెప్టెంబరు, 11(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఎల్బి స్టేడియంలో ఈనెల 9, 10వ తేదీలలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ పోటీలలో గడాల అనిత ప్రతిభ కనబరిచారు. నిజామాబాద్ జిల్లా తరఫున రెజ్లింగ్ విభాగంలో ప్రాతినిధ్యం వహించిన గడాల అనిత రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు ఆమెను అభినందించారు.

యూరియాను కేంద్రం విడుదల చేయాలి

ఆర్మూర్‌టౌన్,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): తెలంగాణకు యూరియా సరఫరాపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపకుండా రాష్ట్రానికి రావాల్సిన యూరియా వాటాను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని బీసీసెల్ పట్టణ అధ్యక్షుడు దొండి రమణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యవసాయ పంటలకు సరైన సమయంలో యూరియా వాడకపోతే పంటల దిగుబడి తగ్గి దెబ్బతినే ప్రమాదం ఉందని రైతుల పంటలను దృష్టిలో ఉంచుకొని యూరియా సరఫరా చేయాలని అన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు మౌనంగా ఉండడం సమంజసం కాదని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు.

రాష్ట్రస్థాయిలో మున్సిపాలిటీకి ర్యాంకులు

ఆర్మూర్ టౌన్ ,సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో ఆర్మూర్ మున్సిపాలిటికి వంద రోజుల కార్యచరణ ప్రణాళిక అనంతరం రెండు, నాలుగవ ర్యాంకులు లభించినట్లు మున్సిపల్ కమీషనర్ రాజు తెలిపారు. సీడీఎంఏ నిర్ణయించిన లక్ష్యాలకు అనుగుణంగా మున్సిపల్ పరిధిలో ఉన్న నీటి కుళాయి కనెక్షన్‌లు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో రెండవ స్థానం, నివాస ఆస్తులను వాణిజ్య స్థలాలుగా మార్చడంలో నాలుగవ ర్యాంకు, వాణిజ్య ,మిశ్రమ ఆస్థులకు వాణిజ్య లైసెన్సుల జారీలో 34వస్థానంలో ర్యాంకులు సాధించామని కమీషనర్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడంలో సహకరించిన రెవెన్యూ ఇంజనీరింగ్, పారిశుధ్య విభాగం సిబ్బందితో సహ ప్రతీ ఒక్కరికి ధన్యవాదులని ఆయన తెలిపారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన వ్యక్తి మాట్లాడడంలేదని మనస్తాపంతో ఓ యువతి గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ వివరాల ప్రకారం.. సబ్దల్‌పూర్ గ్రామానికి చెందిన బత్తుల రామచందర్ గంగమణి దంపతుల పెద్ద కుమార్తె సావిత్రి(19)గురువారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సమాచారం తెలిసిన వెంటనే ఇంటికి చేరుకున్న తండ్రి రామచందర్ బెడ్‌రూంలో ఒక లాంగ్‌బుక్‌లో సావిత్రి రాసిపెట్టిన లెటర్ కన్పించింది. అందులో శెట్పల్లి సంగారెడ్డికి చెందిన ఓయువకుడితో తనకు ప్రేమ సంబంధం ఉందని, అతడు తనతో మాట్లాడటం లేదని, మోసం చేశాడని పేర్కొంది. ఈ ఘనటపై తండ్రి ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాయిబాబా పల్లకి సేవలో భక్తులు


వేల్పూర్,సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల అమీనాపూర్ గ్రామ శివారులో శ్రీసాయిబాబా దేవాలయంలో గురువారం సాయిబాబా పల్లకీ సేవా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రవాస సేవ, గోపూజ, కాగడ హారతితో పాటు ధ్యాన మందిరంలో భక్తి గేయాలతో భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పల్లకి సేవా నిర్వహించారు. సాయి పల్లికీలో సాయిబాబా చిత్ర పటానికి ఉంచి ఆలయ ప్రాంగణం చుట్టు సుమంగళి మహిళలు మంగళ హారతులతో భజన కార్యక్రమాలతో పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

మోర్తాడ్ ,సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం వద్ద గురువారం మండల పారిశుద్ధ్య కార్మికులు ధర్నా చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు గత రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని జిల్లా సహాయ కార్యదర్శి సత్తెక్క ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్, గంగాధర్, ముత్తెన్న, దేవన్న, రవి, శరత్, రాజేశ్వర్, రాజు, పోశన్న, సత్తెమ్మ, గంగన్న పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

జక్రాన్‌పల్లి,సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో నట్ట నికిల్ గుండె పోటుతో మృతిచెందగా ఆయన కు టుంబాన్నిగురువారం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గో వర్ధన్ పరామర్శించారు.మృతుడి అన్న మండల బీఆర్ఎస్ అధ్యక్షుడునట్టభోజన్నను, మృతుడి కుటుంబ సభ్యుల ను ఎమ్మెల్యే పరా మర్శించి ఓదార్చారు.ఆయన వెంట ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, మాజీ ఎంపీపీలు దీకొండ హరిత, శ్రీనివాస్, మాజీ వైస్ఎంపీపీ తిరుపతి రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆలూర్ భాస్కర్ రెడ్డి, ఉన్నారు.


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మాక్లూర్,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):పరిసరాలనుఎప్పటికప్పుడు పరిశు భ్రంగా ఉంచుకుంటే ఎలాంటి రోగాలు దరి చేరవని డాక్టర్ శ్రీశైలం గ్రామస్థులకు వివరించారు.అమ్రాద్,ముత్యంపల్లిల్లో ఎన్ఎస్ఎస్ శీతాకాలం శిబిరంలో గురువారం పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో ప్రోగాంఅధికారులు మాధవి, మమత పా ల్గొన్నారు.

పసుపు పరిశోధన కేంద్ర సందర్శన

కమ్మర్‌పల్లి,సెప్టెంబరు11:(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని పసుపు పరి శోధన కేంద్రాన్నిగురువారం నిజామాబాద్ గిరిరాజ్ కళాశాల బయోటెక్నాలజీకి చెందిన 25 మంది విద్యార్థులుసందర్శించారు.ఈసందర్భంగా పసుపు పరిశోధన కేంద్రలో నిర్వహిస్తున్న పరిశోధనలు,పసపు సాగుపద్ధతులు, పసపులో వివిధ రకాల వంగడాలు, పరిశోధన ల్యాబ్‌లను సందర్శించి పరిశీలించారు.అనంతరం విద్యా ర్థులకు పసుపు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త మహేందర్ పవర్‌ప్రజంటేషన్ ద్వార పరిశో ధనలు పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త మహేందర్

మరో శాస్త్ర వేత్త భాస్కర్, టెక్ని కల్ అసిస్టెంట్ శ్రీనివాస్ విద్యార్థులు ఉన్నారు.

నవీపేటలో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ

నవీపేట,సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం మైనారిటీ సోదరులు మిలాద్ ఉన్ నబీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మక్కా మసీద్ నుంచి జమా మసీద్ వరకు


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు తిరుపతి, యాదగిరి గౌడ్, మాక్లూర్ ఎస్ఐ రాజశేఖర్, నిజామాబాద్ 5 వ టౌన్ ఎస్ఐ గంగాధర్ ప్రత్యేక పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు జబీర్, మూసా, తాహెర్, మోహిజ్, అర్షద్ ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీజ్


బాబాపూర్‌లోమద్యాన్ని సీజ్ చేసిన ఆబ్కారీ అధికారులు

భీమ్‌గల్‌రూరల్ ,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):మండలంలోని బాబాపూర్ గ్రామంలో జంగిటి నరేష్, నరాబోయిన సుమలత ఇద్దరు అక్రమంగా మద్యాన్ని ఇంట్లో నిల్వ చేసి, అధిక ధరలకు అమ్ముతున్నారని అందిన సమాచారం మేరకు గురువారం దాడులు చేసి వారి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన సుమారు ఎనిమిది లీటర్ల మద్యాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆబ్కారి ఎస్ఐ గోవర్దన్ తెలిపారు. ఈ దాడిలో కానిస్టేబుల్ లు దత్తాద్రి, శ్రీనివాస్ రెడ్డి, జగదీష్, రాణి పాల్గొన్నారు.

40 మంది వాహన చోదకులకు జరిమానాలు

బీర్కూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):బీర్కూర్ మండల కేంద్రంలో గురువారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. రోడ్డు నిబంధనలు పాటించని 40 మంది వాహన చోదకులకు జరిమానాలు విధించినట్లు పోలీసులు తెలిపారు. పలువురికి జరిమానాలు విధించారు. అలాగే మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరు వాహనదారులపై డ్రంకెన్ డ్రైవ్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వాహనదారులకు ఐదు వేల జరిమానాలు విధించారు. మూడు వేల పెండింగ్ జరిమానాలు కట్టించినట్లు పోలీసులు తెలిపారు.

మంజీరలో మహిళ మృతదేహం

పిట్లం సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి)మండలంలోని బోల్లక్‌పల్లి గ్రామ శివారులో గల మంజీర నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉందని గురువారం ఎస్సై వెంకట్‌రావ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంజీర నదిలో మహిళ మృతదేహం లభించిందని మహిళ పాక్షికంగా కుళ్లి, ఉబ్బి గుర్తించడానికి వీలులేనివిధంగా ఉన్నదని మృతురాలు నీలిరంగు చీర, మెరున్‌కలర్ గాజులు కలవని తెలిసిన వారు పిట్లం పోలీసుస్టేషన్‌లో 8712686171, బాన్సువాడ రూరల్ 8712686170 కాల్ చేయగలరని తెలిపారు.

గోడకూలి వృద్ధదంపతులకు గాయాలు


బాధితులను పరామర్శించిన తహసీల్దార్

మద్నూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భారీగా కురిసిన వరుస వర్షాలకు ఇంటి గోడ తడిసి హండే కేలూరు గ్రామంలో తుమ్మల్వార్ హన్మండ్లు, రుక్మిణి బాయి దంపతులపై ఇంటి ప్రహరీ గోడ కూలి స్వల్ప గాయాలు కాగా వారిని మద్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.స్పందించిన తహసీల్దార్ ముజీబ్, ప్రజాప్రతినిధులు మద్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధ దంపతులను పరామ ర్శించారు.విషయం తెలుసుకున్న తహసీల్దార్ ముజీబ్ బాధితుల ఇంటికి వెళ్లి వర్షానికి తడిసి కూలిన ఇంటిని పరిశీలించారు. వెంటనే వరద బాధితులకు అందించే ఆర్థికసహాయం కోసం అధికారులకు నివేదిక పంపిం చారు. ఆసుపత్రిలో బాధితులను పరామర్శించిన వారిలో మండల గిర్ద వార్ ఎం. శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరస్ సాయిలు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నాలుగు ట్రాక్టర్లు, రెండు ఆటోలు పట్టివేత

సాలూర,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):మండలం మందర్నా మంజీర పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, రెండు ట్రాలీ ఆటోలను మండల తహసీల్దార్ శశిభూషణ్ సీజ్ చేశారు.పట్టుకున్న వాహనాలను బోధన్‌రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఇసుకను అనుమతులు లేకుండా తరలించినట్లయితే కేసునమోదు చేసి భారీ జరిమానాలు విధించనున్నట్లు తహసీల్దార్ హెచ్చరించారు.

బ్యాంక్‌లో రూ.5లక్షల చోరీ

బోధన్,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.5లక్షల చోరీ జరిగినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. ఈ నెల 8వ తేదీన బ్యాంక్ కౌంటర్‌లో రూ.5లక్షల చోరీకి గురయ్యాయి. బ్యాంక్ సిబ్బంది బ్యాంక్ ముగింపు సమయంలో నగదును ట్యాలీ చేస్తుండగా రూ.5లక్షలు తక్కువగా వచ్చాయి. బ్యాంక్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. బ్యాంక్‌లో లావాదేవీలు జరిపే వారితో పాటు బ్యాంకు సిబ్బంది సైతం అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంక్‌లో అనుమానస్పదంగా సంచరిస్తే సెక్యూరిటి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

● రాత్రి ఒంటి గంటకు పోలీసుల దాడి ● పలువురిపై కేసు నమోదు

నసురుల్లాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నస్రులాబాద్ మండల కేంద్రంలో గల పోచమ్మ కాలనీలో వ్యభిచారం నిర్వహిస్తున గృహంపై బుధవారం అర్ధరాత్రి స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దాడి నిర్వహించి పలువురిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై రాఘవేంద్ర తెలిపారు. వ్యభిచార గృహంలో పట్టుబడిన వారి పేర్లను బస్వాయిపల్లికి చెందిన హైమద్, బాన్సువాడ పట్టణానికి చెందిన సాయగౌడ్, సంఘమిత్ర, ప్రమోద్, జయలను అదుపులోకి తీసుకోని విచారించడం జరిగిందన్నారు. మండల కేంద్రంలో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యక్తిపై కూడా కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు. వారి వద్ద నుండి రెండు ఫోన్లు, రూ.500 స్వాధీన పరుచుకుని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువకుడి ఆత్మహత్య

మోపాల్,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గూపన్‌పల్లి గ్రామానికి చెందిన చింతకుంట రాజు (38) ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడి నట్లు ఎస్సై అరీఫ్ తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల రాజు తాగుడుకు బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గుండె పోటుతో టెక్నికల్ అసిస్టెంట్ మృతి

ముప్కాల్,సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి):బాల్కొండ మండలంలో ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ధనుంజయ్ (42) గురువారం గుండె పోటుతో మృతిచెందాడు. మండలంలోని బస్సాపూర్ గ్రామానికి విధుల్లో భాగంగా వెళ్లి వస్తుండగా గుండెలో నొప్పి రావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ధనుంజయ్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈయనకు భార్య, మూడేళ్ల కూతురు ఉన్నారు. గత కొంతకాలంగా వేతనాలు సమయానికి రాక ఆర్థిక ఇబ్బందులతో సతమతం కావడంతోనే గుండె పోటు వచ్చిం దని పలువురు భావిస్తున్నారు. శుక్రవారం బాల్కొండలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నవీపేట,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గురువారం మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్‌ను వారు కలిశారు. పంచాయతీ కార్మికులకు దసరా పండుగ సందర్భంగా బోనస్ చెల్లించాలని కొత్త దుస్తులు ఇప్పించాలని కోరారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్, సీఐటీయూ నాయకులు నాయక్‌వాడి శ్రీనివాస్, అంజనేయులు, దేవేందర్ సింగ్, పోశెట్టి, గంగాధర్ తదితరులున్నారు.

గ్రంథాలయ భవన పరిశీలన

మోస్రా,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న గ్రంథాయలం భవనం శిథిలావస్థలో ఉండడంతో పాఠ్య పుస్తకాలు వానకు తడిసిపోగా కొనసాగించలేమని సంబంధిత జిల్లా స్థాయి అధికారులు తెలియజేశారు. ఈ క్రమంలో గ్రామ యువకులు, నిరుద్యోగులు, గ్రామ అభివృద్ధి కమిటీ వారికి విషయం తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ శాఖ అధ్యక్షుడు అంతిరెడ్డి రాజారెడ్డి మాట్లాడుతూ గ్రామ కమిటీ భవనంలోకి మార్చుతున్నట్లు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోని పోటీపరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు.ఈకార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు బిల్లా పోతారెడ్డి, ఉమ్మడి వర్ని మండల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంతియాజ్, గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

విలేకరి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు, 11(ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలం మిట్టపల్లికి చెందిన లక్కవత్రి నారాయణ కుటుంబాన్ని ప్రభుత్వమే అన్ని విధాలుగా ఆదుకోవాలని టీయుడబ్ల్యుజేయు జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతిచెందిన లక్కవత్రి నారా యణ ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపి సంతాపం ప్రకటించా రు. ప్రజలకు, ప్రభుత్వానికిమధ్య వారధిగా పనిచేస్తున్న విలేకరి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

▸▸ జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్

బోధన్,సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మరింత పురోగతి సాధించాలని జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ అంకిత్ సూచించారు. పట్టణంలోని 36వ వార్డులో కొనసా


పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

గుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లు ఏ మేరకు పూర్తయ్యాయి అని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఇళ్లను పూర్తి చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. నిర్మాణ స్థాయిని బట్టి బిల్లులు త్వరితగతిన చెల్లించాలని సూచించారు.పన్నులను వందశాతం వసూలు చేయడంపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు.ఆయన వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, డీఈ యోగేష్, ఏఈ శ్రీనివాస్ తదితరులున్నారు.

బీడీ కార్మికుల సమస్యల సాధనకు ఉద్యమిస్తాం

▸▸ బిఎల్‌టీయు రాష్ట్ర అధ్యక్షుడు సిద్ది రాములు

ఆర్మూర్ , సెప్టెంబరు, 11(ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల సమస్యల సాధనకు ఉద్యమి స్తామని బీఎల్‌టీయు రాష్ట్ర అధ్యక్షుడు సిద్ది రాములు అన్నారు. గురువారం ఆర్మూర్‌లో తెలంగాణ బహుజన బీడీకార్మికసంఘం, బీఎల్‌టీయూ రాష్ట్రరెండో మహాసభల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా బీడీ కార్మికులందరికి రూ. 4016 జీవన భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం ఏర్పడి రేండేళ్లవుతున్న బీడీ కార్మికులకు ఇంతవరకు జీవన భృతి అందలేదన్నారు.ఈ విషయాలపై పోరాటం చేయడానికి వచ్చే నెల 11, 12వ తేదీలలో నిజామాబాద్ పట్టణంలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని, ముఖ్యఅతిథిగా జిల్లాఇన్‌చార్జి మంత్రి సీత క్క, వివిధ సంఘాల నాయకులు హాజరవుతారని, ఈమహా సభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మత్తు పానీయాలను నిర్మూలించాలి

బోధన్,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పానీయాలు నిర్మూలించాలని ప్రగతిశీల మహిళ సంఘం అధ్యక్షురాలు నాగమణి అన్నారు. గురువారం బోధన్ ఎక్సైజ్ సీఐ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘం నాయకురాలు బీఫాషా బేగం, శాంతబాయి, లక్ష్మి, నాగమణి, సువర్ణ, లత, గంగామణి, సుజాత, సునంద, సీతారాం, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక విద్య పై అవగాహన

మోర్తాడ్ , సెప్టెంబరు, 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో యువతకు ఆర్థిక విద్య పై అవగాహన కల్పించడం కోసం వర్క్‌షాప్, సర్టిఫికేషన్ ప్రోగ్రాంను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దన్న వర్క్‌షాపును ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజన్ శీర్షికన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటి మార్కెట్ ముంబాయి వారి రూపకల్పనలో కొటాక్ సెక్యూరిటి లిమిటెడ్ సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భూపతి, దశరత్ అవంతి, అధ్యాపకులు, అధ్యాపకేతరులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం

కోటగిరి,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారం గ్రామానికి చెందిన అజ్మీర లక్ష్మి అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో రెజ్లింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి పొందింది. జాతీయ స్థాయి పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. రాబోయే రోజుల్లో అజ్మీర లక్ష్మికి తమ ట్రస్ట్ ద్వారా మరింత సహకారం అందిస్తామని ట్రస్ట్ చైర్మన్ కోనేరు శశాంక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రకాష్ పటేల్, ఓమన్న పటేల్,సంతోష్‌పటేల్, రాజు,గంగాధర్,తదితరులు పాల్గొన్నారు.

సైద్‌పూర్‌లో రేషన్ షాప్ ప్రారంభం

వర్ని,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): వర్ని మండలం సైద్‌పూర్ గ్రామంలో గురువారం రేషన్ షాప్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ కులకర్ణి సురేష్ ప్రారంభించారు. గ్రామంలో రేషన్ షాపు అందుబాటులో లేక స్థానికులు దూర ప్రాంతాలకు వెళ్లి నిత్యావసర సరుకులు తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో బోధన్ సబ్ కలెక్టర్, ఎమ్మెల్యేకు గ్రామస్థులు మొరపెట్టుకోగా వారు తక్షణమే స్పందించి రేషన్ షాపును అందుబాటులోకి తెచ్చారు. కార్యక్రమంలో కిషన్ రాథోడ్, రంజ్యా నాయక్, తహసీల్దార్ సాయిలు, చందర్ నాయక్, నరేందర్, హరి నాయక్ పాల్గొన్నారు.

గ్రామ పరిపాలన అధికారులు వచ్చేశారు

మద్నూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామల్లో మళ్లీ రెవెన్యూ వ్యవస్థ పని చేయనుంది. గతంలో వీఆర్ఏలుగా, వీఆర్వోలుగా ఉన్న వ్యవస్థ ప్రస్తుతం జీపీవో (గ్రామ పరిపాలన అధికారి)గా మారింది. పూర్వ వీఆర్వోలు ఎట్టకేలకు రెవెన్యూ శాఖలోకి వచ్చేశారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో 34 గ్రామ పంచాయితీలకు 21 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మద్నూర్ మండలానికి 14 మంది జీపీవోలను, డోంగ్లి మండలానికి తొమ్మిది జీపీవోలను కలెక్టర్ కేటాయించారు. గురువారం మద్నూర్ మండలంలో ఆరుగురు, డోంగ్లి మండలంలో నలుగురు, మద్నూర్ తహసీల్దార్ ముజీబ్, డోంగ్లి తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌లను కలిసి విధుల్లో చేరారు.

బీర్కూర్: మండలానికి తొమ్మిది మంది గ్రామ పాలన అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తొమ్మిది మంది అధికారులు గురువారం బాధ్యతలు చేపట్టారు. వీరాపూర్‌కు గైని బాల్ రాజ్, తిమ్మాపూర్, పోషెట్టి పల్లి, సుల్తాన్ పూర్‌లకు సాయిలు, కిస్తాపూర్‌కు సంతోష్, దామరాంచ, అన్నారంలకు హన్మండ్లు, బరంగ్ ఏడ్గీ మల్లేష్, భైరాపూర్, మల్లాపూర్‌లకు సంతోష్, బీర్కూర్ 2కు శ్రీనివాస్, బీర్కూర్ 1కు శ్రీనివాస్, చించొల్లి గ్రామానికి మంజులను నియమించారు.

నిజాంసాగర్: మండలానికి కొత్తగా 11 మంది జీపీవోలు నియామకమయ్యారు. గురువారం జాయిన్ అయ్యారు. ఇద్దరు జీపీవోలు జాయిన్ కావాల్సి ఉందని తహసీల్దార్ భిక్షపతి తెలిపారు. గ్రామాల వారీగా వీరే బంజపల్లి శేఖర్ మల్లూరు, ఎస్.రమేష్ అచ్చంపేట, జి.సంగమేశ్వర్‌రెడ్డి బ్రాహ్మణపల్లి, ఎ.శ్రీనివాస్ ఆరేపల్లి, ఎం.రమేష్, నర్సింగరావుపల్లి, ఎండీ ఖాజా మంగళూరు, డి.దిలీప్‌కుమార్ వెనగలూర్, వై.కిరణ్ జక్కాపూర్, మంజుల వడ్డేపల్లి, ఎన్.అంజయ్య గోర్గల్, మాగి (టి) సాయిబాబాలు విధి నిర్వహణలో చేరారని ఆయన తెలిపారు. జీపీవోలకు గ్రామ పంచాయితీలోని ఓ చాంబర్ ఉంటుందని ఆయన తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల అందజేత



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ఉత్తర్వులను అందజేస్తున్న ఏఎంసీ అధ్యక్షులు, ప్రతినిధులు

నిజాంసాగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలంలోని మాగి అచ్చంపేట గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మంజూరు ఉత్తర్వు పత్రాలను గురువారం పిట్లం మార్కెటింగ్ కమిటీ అధ్యక్షులు చికోటి మనోజ్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, ఇందిరమ్మ లబ్ధిదారులకు అందజేశారు. మాగీ గ్రామంలో 15 మందికి, అచ్చంపేట గ్రామంలో ఎనిమిది మందికి ఇల్లుమంజూరయ్యాయి. మొదటి విడత అచ్చంపేట గ్రామంలో 22 మందికి ఇల్లు మంజూరు కాగా రెండో విడత మరో ఎనిమిది మందికి ఇల్లు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంకుల లక్ష్మయ్య, మంద బలరాం, ఎంపీఈవో గంగాధర్, గ్రామ పంచాయితీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

మురుగుకాలువ శుభ్రం చేసుకున్న కాలనీ వాసి



మురుగు కాలువ తీసుకుంటున్న కాలనీ వాసి

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామంలో గల మురికి కాలువలు చెత్త చెదారంతో పూడుకుపోయాయి. దీంతో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పంచాయతీ సిబ్బంది సక్రమంగా చేయకపోవడంతో ఇబ్బందిగా మారిందని కాలనీ వాసులు వాపోతున్నారు. దీంతో ఈ విషయం గురించి ఎన్నిసార్లు పంచాయితీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో ఎస్‌సి కాలనీకి చెందిన ఓ వ్యక్తి స్వయంగా మురికికాలువలోకి దిగి కాలువను శుభ్రం చేసుకున్నాడు.

ముక్కిపోతున్న దొడ్డు బియ్యం

- రేషన్ షాపుల్లో నిల్వ ఉంచడానికి స్థలం లేక ఇబ్బంది పడుతున్న డీలర్లు
- దొడ్డు బియ్యంతో పాటు చెడిపోతున్న సన్న బియ్యం
- అధికారులు దొడ్డు బియ్యాన్ని తరలించాలని వేడుకుంటున్న డీలర్లు



దేమి కలాన్ రేషన్ షాపులో ముక్కిపోయి నిల్వ ఉన్న దొడ్డు బియ్యం



దొడ్డు బియ్యంతో పాటు జాలి కట్టిన సన్న బియ్యం

తాడ్వాయి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలు ఆకలితో అలమటించకుండా అన్నం బువ్వ తినాలని ప్రతిష్టాత్మకంగా అన్న బియ్యం పథకాన్ని తీసుకువచ్చింది. ఇది సజావుగా సాగుతున్న గ్రామాల్లోని రేషన్ షాపులలో ఉన్న దొడ్డు బియ్యాన్ని ఎలుకలు, పందికొక్కులు, వర్షాలతో ముక్కిపోతున్నాయి. అటు ప్రజలకు పంపిణీ చేయకుండా ఇటు అధికారులు తీసుకుపోకుండా రేషన్ దుకాణాల్లోనే ముక్కిపోతున్నాయి. ఎక్కువ పురుగులు పట్టి చెదలు పట్టి జాలి కట్టుతున్నా యని డీలర్లు అంటున్నారు. ప్రతీ గ్రామ రేషన్ షాపులలో దొడ్డు బియ్యం నిలువ ఎక్కువగా ఉన్నవి. ఈ దొడ్డు బియ్యం విలువ ఉండటంతో పేద ప్రజ లకు పంచే సన్న బియ్యం సైతం పాడవుతున్నాయని డీలర్లు ఆవేదన చెందు తున్నారు. నిలువ ఉన్న దొడ్డు బియ్యంలోని చెదలు పురుగులు సన్న బియ్యం లోకి చేరి బియ్యం పాడైతుందని అంటున్నారు. జాలి కట్టిన బియ్యాన్ని లబ్ధి దారులకు పంపిణీ చేస్తే మమ్మల్ని దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ప్రభుత్వం దొడ్డు బియ్యాన్ని తరలిస్తే వచ్చే తరుగును కూడా మేమే మోయాల్సి వస్తుందే మోనని ఆందోళన చెందుతున్నారు. ఒక్క రేషన్ షాపులోనే 25 క్వింటాళ్ల దొడ్డు బియ్యం ఉంటే ప్రతి షాపుల్లో ఎంత మేరకు వున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికి ఆరు నెలలైనా దొడ్డు బి య్యాన్ని అధికారులు తరలించడం లేదని రేషన్ డీలర్లు అంటున్నారు. ఇప్పటికే రేషన్ షాపులలో ఉన్న దొడ్డు బియ్యం ముక్కిపోయి వాసన పడుతున్నాయని అంటున్నారు. గ్రామాల్లోని రేషన్ దుకా ణాలలో దొడ్డు బియ్యం ఉన్నాయని అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని అంటున్నారు. దొడ్డు బియ్యాన్ని చూసి గ్రామాల్లోని ప్రజలు ప్రజాధనం వృథా అవుతుందని అనుకుంటున్నారు. ఇకనైనా మండలంలోని వివిధ గ్రా మాల్లో ఉన్న దొడ్డు బియ్యాన్ని అధికారులు తరలించాలని ఆయా గ్రామాల రేషన్ డీలర్లు కోరుతున్నారు.

● రేషన్ దుకాణాల్లో ఉన్న దొడ్డు బియ్యాన్ని అధికారులు వెంటనే తరలించాలి



దొడ్డు బియ్యంతో రేషన్ దుకాణాల్లో ఇబ్బంది ఏర్పడుతుంది. దుకాణాల్లో ఉన్న బియ్యం ముక్కి పోతున్నాయి.

- సంతోష్ రావు,
జిల్లా రేషన్ డీలర్ల ప్రధాన కార్యదర్శి

● ఉన్న దొడ్డు బియ్యం పూర్తిగా పాడైపోతుంది



ఉన్న దొడ్డు బియ్యం పూర్తిగా పాడైపోతున్నాయి. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్న దొడ్డు బియ్యం తో పాటు సన్న బియ్యం పాడైపోతున్నాయి బియ్యం పంపిణీ చే యాలంటే ఇబ్బంది అవుతుంది.

- గౌరిశెట్టి రాజు,
జిల్లా రేషన్ డీలర్ల గౌరవ అధ్యక్షుడు

తెగిన చెరువు కట్టకు మరమ్మతులు చేసిన రైతులు

- అధికారులు స్పందించాలని చెరువుకు మరమ్మతులు చేయాలని కోరుతున్న రైతులు



తిమ్మాపూర్‌లో తెగిన చెరువు కట్టకు ఆయకట్టు రైతులే మట్టి పోస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా గ్రామస్తులు తమ చెరువును బాగు చేసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. చెరువు నీరు వృథా కాకుండా కాపాడుకునేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు వరద ఉధృతికి తిమ్మాపూర్ గ్రామ చెరువు కట్ట, పంట కాల్వలు, మత్తడి కొట్టుకుపోయింది. ఆ గ్రామ శివారులోని పంటలకు ఆధారమైన చెరువు ధ్వంసం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెరువు కింద వేసిన మొక్కజొన్న వరి పంటలకు నీరు లేకపోవడంతో చేతికొస్తున్న పంటలు దెబ్బతింటున్నాయని చెరువు, కట్ట మరమ్మతులు ప్రారంభించాలని సంబంధిత అధికారులు, నాయకులకు విన్నవించారు.



జేసీబీతో కట్ట పోయిస్తున్న ఆయకట్టు రైతులు

● ప్రతీ ఇంటి నుంచి ఒకరు

ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో, పంటలు ఎండిపోతాయే మోనని రైతన్నలు ఆందోళన చెందారు. అధికారులు పనులు చేసేవరకు వేచి ఉంటే తమ పంటలు దక్కవని భయాందోళనలతో గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఒకరు వచ్చి శ్రమదానంతో కట్టకు ఏర్పడిన బుంగను పూడ్చేందుకు శ్రమించారు. జేసీబీని ఏర్పాటు చేసి కాల్వల మరమ్మతులు, చెరువు బుంగ, పూడిక చేసేందుకు చేయిచేయి కలిపారు. కట్ట నుంచి నీరు వృథా పోతున్న నీటిని కాపాడుకునే ప్రయత్నం చేశారు.

● 120 ఎకరాల్లో కొట్టుకుపోయిన పంటలు

ప్రస్తుత పంటకాలంలో 520 ఎకరాల్లో వరి, మక్క పంటలు వేశారు. అందులో 120 ఎకరాల్లో వరద ఉధృతికి పంట ధ్వంసమైంది. మిగిలిన పంటలు కీలక దశలో ఉండగా, నీటి సరఫరా నిలిచిపోవడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. పరిస్థితిని తట్టుకోలేక, రైతులే స్వయంగా చెరువు కట్టను పూడ్చే పనులు, కాలువ మరమ్మతులు చేసి నీటిని ఒడిసిపట్టేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు.

● నిధులు మంజూరైన నిర్లక్ష్యమేలా..?

వరదల అనంతరం పంటలు వాడిపోకుండా తక్షణమే నీటి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులు ప్రతి పాదనలు పంపించారు. రూ.9 లక్షల వరకు మంజూరైన పనులు ప్రారంభించకపోవడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నాయకులు సందించక పోవడంతో తమ పంటలను రక్షించుకునేందుకు తామే కష్ట పడుతున్నామని ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

● అధికారులు, నాయకులు స్పందించాలి

రైతులు, జిల్లా అధికారులు, నీటి పారుదల శాఖ తక్షణం స్పందించి, చెరువు కట్ట పునరుద్ధరణ, కాలువ మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే వందల ఎకరాల పంటలు నష్టపోయే ప్రమాదం ఉందని, తమ జీవనోపాధిని కోల్పోయి తిండికి తిప్పలు అవుతాయని వాపోతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్ల వివరణ కోరగా చెరువు మరమ్మతు పనులను ప్రారంభించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

మద్నూర్‌లో చిరుత కలకలం

- భయాందోళన చెందుతున్న రైతులు



మద్నూర్ శివారులో చిరుత పాద ముద్రలు సేకరిస్తున్న అటవీ అధికారులు

మద్నూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి సమీపంలోని జాతీయ రహదారి బైపాస్ రోడ్డు వద్ద శివారులో రాత్రి 10గంటల ప్రాంతంలో ఫైమద్ అనే యువకుడు చిరుత పులి చూసినట్లు తన మిత్రులతో చెప్పగా ఆ విషయం వాట్సాప్‌లో చెక్కర్లు కొట్టడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై మద్నూర్ మండల ఫారెస్ట్ బీట్ అధికారి రామచందర్, మద్నూర్ ఎస్సై విజయ్ కొండ శివారు ప్రాంతంలో కొద్దిగా పాదముద్రలకు సంబంధించిన గుర్తులను కనుగొన్నారు. ఆ గుర్తులు చిరుతకు సంబంధించినవి కావని అడవి పిల్లికి సంబంధించినవిగా ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. చిరుత పులి పాద ముద్రల కంటే రెండు ఇంచులు తక్కువగా ఉండటం వల్ల అడవి పిల్లిగా గుర్తించినట్లు తెలిపారు. రైతులు ప్రజలు భయపడాల్సింది లేదని సూచించారు.

ప్రజావాణి ఫిర్యాదును పరిష్కరించిన డీఎల్పీవో



వివాదస్పద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దకొడప్‌గల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథ్ పల్లి తండా పరిధిలో వివాదస్పదంగా ఉన్న ఓ స్థలంపై ప్రజావాణిలో ఫిర్యాదు రాగా బాన్స్‌వాడ డీఎల్‌పీవో, ఎంపీడీవోలు పరిష్కరించారు. తండా పరిధిలో సీసీ రహదారి వేసేందుకు గాను గతంలో ప్రయత్నం జరగగా, ఈ స్థలం తమకు చెందినదని, ఇందులో నుంచి రహదారి వేసేందు కు వీలు లేదని రెండు ఇళ్లకు చెందిన వారు అభ్యంతరం తెలపగా పనులు ఆగిపోయాయి. దీంతో ఈ విషయంపై ప్రజావాణిలో ఫిర్యాదు రాగా గురువారం బాన్సువాడ డీఎల్పీవో సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు గ్రామానికి వెళ్లి ఇరువర్గాలను ఒప్పించి సమస్యను పరిష్కరించారు. ఇరువర్గాలకు చెందిన స్థలం ఒక్కొక్కరి నుంచి 6 పీట్ల చొప్పున సేకరించి రోడ్డు వేసేందుకు అంగీకరింపచేశారు. దీంతో గత కొద్ది నెలల నుండి అపరిష్కృతంగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అంజయ్యపంచాయితీ కార్యదర్శి బాల్‌రాజ్, నా యకులు చిప్ప మోహన్, శ్యామప్ప, మల్లప్ప పటేల్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచంలో అన్నింటికంటే మహోన్నతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి

- ● జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం



బీర్కూర్‌లో మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం

బీర్కూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో మహోన్నతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు అధ్యాపకులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడం అభినందనీయమన్నారు. ప్రపంచంలో అన్నిటికంటే మహోన్నత మైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని పేర్కొన్నారు. విద్యార్థులు అందరూ బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వృత్తుల వారిని తయారు చేసే వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు యాదాగౌడ్, సత్తన్న, రంజిత్, దేవిసింగ్, నారాగౌడ్, సౌమ్య, సతీష్, సుభాష్, బాలకిషన్, రాకేష్ పాల్గొన్నారు.

జీపీవోలుగా వెళుతున్న వార్డు అధికారులకు సన్మానం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో వార్డు అధికారులుగా పనిచేసిన ఆరుగురు జీపీవోలుగా వెళ్తున్న వారిని గురువారం మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ శాలువతో సత్కరించి సన్మానం చేసి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీపై వెళ్తున్న ఆరుగురు మున్సిపాలిటీలో చురుగ్గా పనిచేశారని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వాసంతి, మున్సిపల్ ఏఈ వినోద్, రెవెన్యూ విభాగం అధికారి సూర్యవర్ధన్, వార్డు అధికారులు జ్యోతి, అంజయ్య, సిబ్బంది ప్రదీప్ పాల్గొన్నారు.



జీపీవోగా వెళుతున్న అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

రాష్ట్ర సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టు



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయరావు, బొబ్బిలి నగేష్ కుమార్‌లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో గురువారం ఈ ఎంపికలను నిర్వహించినట్లు తెలిపారు. సుమారు వంద మందికిపైగా బాస్కెట్ బాల్ క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరైనట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. బాలుర విభాగంలో నయన్, విశ్వజిత్, తన్మయ్, అనీష్, శివదత్త, హర్యన్, రిషిరాజ్, భువన్, భార్గవ్, జయసింహా, మన్య, రక్షిత్, మహోదయ్‌లు ఎంపికైట్లు తెలిపారు. బాలికల విభాగంలో మనోజ్ఞ, సహస్ర, సాయిశ్రీ, సెజల్, శ్రీనిత్య, శ్రీనిక, ప్రణీక ఎంపికైనట్లు తెలిపారు. వీరు హైదరాబాద్‌లోని కేబీవీఆర్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపిక పోటీల్లో అసోసియేషన్ సభ్యులు బెనర్జి, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నూతన కార్యవర్గం



బరంగేడ్గిలో బీఆర్ఎస్ గ్రామ నూతన కార్యవర్గ సభ్యులు

బీర్కూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం బరంగ్ ఏడ్గి గ్రామంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కుమ్మరి బాలయ్య, ఉపాధ్యక్షుడు అనిల్, కార్యదర్శి గంగాధర్, ఉప కార్యదర్శి గంగారాం, కోశాధికారి సురేష్, సలహాదారులు ఆంజనేయులు, సంజు, గంగారాం, హన్మగౌండ, కార్యనిర్వహణ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



నారాయణ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీఎం తిరుపతిరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి కేవీ రమణ, కార్యాలయ సిబ్బంది

సీనియర్ రిపోర్టర్ నారాయణ కన్నుమూత

» నేడు స్వగ్రామం మిట్టపల్లిలో అంత్యక్రియలు



నారాయణ (ఫైల్)

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండలానికి చెందిన ఆంధ్రజ్యోతి సీనియర్ రిపోర్టర్ లక్కవత్రి నారాయణ (54) గురువారం ఉదయం స్వగ్రామమైన మిట్టపల్లిలో గుండెపోటుతో కన్నుమూశారు. ఉదయం 6గంటలకే నిద్రలేచిన ఆయన మొక్కలకు నీళ్లు పోస్తూ కుప్పకూలిపోయారు. నారాయణకు భార్య లక్ష్మి, కూతురు సౌజన్య, కుమారుడు సాయికిరణ్ ఉన్నారు. ప్రస్తుతం సాయికిరణ్ దుబాయిలో ఉన్నాడు. గురువారం రాత్రి స్వగృహానికి చేరుకుంటాడు. శుక్రవారం ఉదయం అంత్యక్రియలు మిట్టపల్లిలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా నారాయణ గతంలో ఈనాడుతో పాటు పలు ప్రధాన పత్రికల్లో పనిచేశారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాప సమావేశంలో యూనిట్ బ్రాంచ్ మేనేజర్ నల్లా తిరుపతి రెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జ్ కసుపు వెంకటరమణ, సర్క్యులేషన్ ఇన్‌చార్జ్ మర్క భాస్కర్, ఏడీవీటీ మేనేజర్ రాజేశ్వర్, స్టాఫ్ రిపోర్టర్లు బి. ఆంజనేయులు, పి. ప్రశాంత్, ఎడిటోరియల్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. పాత్రికేయులు గంగాధర్, గోపాల్, శోభన్, మురళితో పాటు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) నాయకులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి సంతాపం ప్రకటించారు. కాగా, నారాయణ మృతదేహాన్ని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సందర్శించి నివాళులర్పించారు.

రూ.5లక్షల ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి, సెప్టెంబర్ 11(ఆంధ్రజ్యోతి): రూరల్ నియోజవర్గంలోని డిచ్పల్లి మండలం ధర్మారం (బి) గ్రామానికి చెందిన మేకల నిహారిక వైద్యం కోసం ఎమ్మెల్యే భూపతిరెడ్డి రూ.5లక్షల ఎల్‌వోసీ పత్రాలను గురువారం అందజేశారు. నిహారిక కొంత కాలంగా గుండె సంబంధిత రుగ్మతతో బాధపడుతూ హైదరాబాదు నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. అయితే శస్త్ర చికిత్స కోసం అవసరమైన డబ్బులు వారికి భారంగా మారాయి. ఈ విషయాన్ని ధర్మారం కాంగ్రెస్ నాయకులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి తెలిపారు. వెంటనే వైద్యం కోసం రూ.5లక్షల ఎల్‌వోసీని రూరల్ క్యాంప్ కార్యాలయంలో అందజేశారు.

వారోత్సవాలను విజయవంతం చేయండి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట విశిష్టతను 17వ తేదీ వరకు ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కమ్యూనిస్టు నాయకత్వంలో జాగిర్దార్లు, జమీందార్లు, భూస్వాములు చేసే దౌర్జన్యాలను, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పేదల పక్షాన నిలబడి కమ్యూనిస్టులు పోరాటం చేసిన విధానాన్ని తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, గంగాధర్, నరేష్, అనిత, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు, దర్గాల వద్ద చెత్తవేయొద్దు

● కాలనీ వాసులకు అవగాహన కల్పించిన ఎస్సై ఆరీఫ్

మోపాల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీలో ఉన్న హన్మాన్ ఆలయం, దర్గా వద్ద ఎవరైనా ఇంట్లో చెత్త తీసుకొచ్చి వేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ ఆరీఫ్ సూచించారు. గురువారం సాయంత్రం కాలనీవాసులతో అవగాహన సదస్సు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ అరీఫ్ మాట్లాడుతూ.. హన్మాన్ ఆలయం, దర్గాల వద్ద చెత్త పారేయడం వల్ల సమస్యలు తీవ్రమవుతున్నాయని అన్నారు. ఇంట్లో చెత్తను చెత్తబండిలోనే వేయాలని, ఎక్కడ పడితే అక్కడ ఆలయాల సమీపంలో పారేయరాదని అన్నారు. ఎవరైనా కాలనీవాసులు చెత్త వేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఒకరికి 10రోజుల జైలుశిక్ష విధిస్తూ, 15మందికి జరిమానా విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ తీర్పు వెల్లడించారు. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాలను సారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ గురువారం డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 16మందికి కౌన్సిలింగ్ నిర్వహించి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ముందు హాజరుపర్చగా 15మందికి 21500 జరిమానా విధించగా, బోర్గాం (పి)కి చెందిన చామకూర లక్‌పతి అనే వ్యక్తి తరచూ మద్యంతాగి వాహనం నడపడం వల్ల పదిరోజులు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

విద్యార్థులకు నోట్ బుక్కుల పంపిణీ

మోపాల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంజర్ గ్రామంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం శ్రీరామ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 400 నోట్ బుక్కులు, 200 పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల చారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పట్ల స్వచ్ఛంద సంస్థలు మానవతాదృక్పథంతో సేవలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, సంస్థ అధ్యక్షులు తంగళ్లపల్లి శ్రీనివాస్, కోశాధికారి తొడుపునూరి రామ్మోహన్, బాలశేఖర్, రాజశేఖర్, శ్రీనివాస్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బస్టాండ్ వద్ద ఆటోవాలాల ఆగడాలు

» బస్సులు లోనికి, బయటకు వెళ్లాలంటే తప్పని ఇక్కట్లు
» రోడ్డుపైనే ఏర్పాటు చసిన పలు దుకాణాలు
» ట్రాఫిక్, మున్సిపల్ అధికారులకు విన్నవించినా తప్పని ఇబ్బందులు



నగర ప్రధాన బస్టాండ్ ఎంట్రీ, ఎగ్జిట్ వద్ద బస్సులకు అడ్డుగా ఉన్న ఆటోలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగర ప్రధాన బస్టాండ్ వద్ద ఆటో వాలాల ఆగడాలు మితిమీరుతున్నాయి. బస్సులు లోనికి వెళ్లే చోట బయటకు వచ్చేచోట దారికి అడ్డంగా ఆటోలను నిలిపి ఉంచడంతో బస్సులు భారీగా నిలిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ట్రాఫిక్ ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని గతంలో ఉన్న రోడ్లను మూసివేసి ప్రస్తుతం ట్రాఫిక్‌కు చెక్‌పెట్టేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన సంవత్సరం ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకపోయినా ప్రస్తుతం ఆటోవాలాల ఆగడాలతో ప్రతిరోజు ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారింది. మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా బస్సులు బస్టాండ్ లోపలకు, బయటకు వెళ్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. గతంలో ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన ఆర్టీసీ కానిస్టేబుళ్లు ప్రస్తుతం లేకపోవడంతో ట్రాఫిక్ పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఆటోవాలలు విచ్చలవిడిగా పార్కింగ్ చేస్తూ బస్సుల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కాలేజీలు, ప్రైవేట్‌కు సంబంధించిన స్థలాల్లో ప్రత్యేకంగా ట్రాఫిక్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు బస్టాండ్ వద్ద మాత్రం పట్టించుకోవడం లేదు. ఆర్టీసీ యాజమాన్యం సైతం ట్రాఫిక్ పోలీసు అధికారులకు పలుమార్లు విన్నవించింది. అయినా ట్రాఫిక్ నియంత్రణ జరగడం లేదు.

అనుమతులు లేకుండానే దుకాణా సముదాయాల ఏర్పాటు

నగరంలోని ప్రధాన బస్టాండ్‌కు ఇరువైపులా ఎలాంటి అనుమతులు లేకుండానే దుకాణా సముదాయాలు నడుస్తున్నాయి. బస్టాండ్ లోపల లక్షల్లో అద్దెలు చెల్లించి షాపులను చేజిక్కించుకుంటున్న టెండర్‌దారులు బస్టాండ్ బయట ఎలాంటి అనుమతులు లేకుండా ఆర్టీసీకి రూపాయి చెల్లించకుండా దుకాణాలను నడుపుతున్నారు. దుకాణ సముదాయాలతో పాటు ఖాళీగా ఉన్న స్థలాల్లో సైతం తమకు సంబంధించిన తోపుడుబళ్లను పెట్టుకుని ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. వీరిపై ఆర్టీసీ యాజమాన్యం ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు కరువయ్యారని ఆర్టీసీ అధికారులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలుమార్లు ఫిర్యాదు చేశాం..

: మధుసూదన్, డీవీఎం నిజామాబాద్

నగర ప్రధాన బస్టాండ్‌లో వందలాది బస్సులు రోజు వస్తూపోతుంటాయి. లోపలకు, బయటకు వచ్చే చోట ఆటోలు అడ్డుగా నిలుపుతుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఏర్పడుతోంది. వీటితోపాటు అక్కడ ఉన్న దుకాణ సముదాయాలతో కూడా ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడుతోంది. పలుమార్లు పోలీసులు, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడం లేదు.

ఇందిరమ్మ ఇళ్లకు మహిళా సంఘాల ద్వారా సహాయం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 11:(ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న మహిళా సంఘాల సభ్యులకు సమాఖ్య ద్వారా లక్ష రూపాయల నుంచి రెండు లక్షల రూపాయల రుణం అందించనున్నట్లు డీఆర్‌డీవో సాయాగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీలో గల సమావేశ మందిరంలో మహిళా సమాఖ్య పదో వార్షిక సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. 14 వేల మందికి మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్లలో 4వేల300మందికి గ్రౌండింగ్ చేయడం జరిగిందన్నారు. మేకలు, గోర్రెలు,పెరటి కోళ్లు, ఎలక్ట్రికల్ బైక్‌లకు స్త్రీనిధి ద్వారా లోన్‌లు ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళ సమాఖ్య ద్వారా ఆర్టీసీలో పెట్టిన బస్సు ద్వారా 68 వేల 500 రూపాయల అద్దె వస్తుందన్నారు. అన్ని గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి ప్రభుత్వం సహాయం అందిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో ఏపీవో మధుసూదన్, డీపీఎం నీలిమా, కిరణ్‌కూమార్, సంధ్యరాణి, మోహన్, రాజేశ్వర్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు హేమలత కార్యదర్శి మమత, కోశాధికారి సూర్యజ్యోతితో పాటు సమాఖ్య సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయాగౌడ్



అనాథలకు సపర్యలు చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మానవత్వం చాటిన ఇందూరు యువత స్వచ్ఛంద సేవాసంస్థ

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మతిస్థిమితం కోల్పోయి మలమూత్రాలు ఒంటికి అంటుకుపోయి దుర్గంధపు వాసనలో దయనీయ స్థితిలో నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న అనాథలకు గురువారం ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ సపర్యలు చేసింది. జుట్టును కత్తిరించి చిరిగిన బట్టలతో అచేతనంగా పడి ఉన్న విధి వంచితులను శుభ్రంగా స్నానం చేయించి కొత్త దుస్తులు వేసారు. ఒంటిపై ఉన్న గాయాలకు మందులుపూసారు. కార్యక్రమంలో ఒకటో టౌన్ పోలీస్ సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, కోశాధికారి జయదేవ్, జంగం రాజు, సుజాత, లాస్య పాల్గొన్నారు.

'కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తే కేసులు'

మోపాల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అనుమతులు లేకుండా ధర్నా, రాస్తారోకో నిర్వహిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందని రూరల్ ఎస్‌ఐ ఆరీఫ్ హెచ్చరించారు. ఎటువంటి నిరసన కార్యక్రమాలు ఉన్నా నిజామాబాద్ ఏసీపీ అనుమతితో ధర్నాచౌక్, ఓల్డ్ కలెక్టరేట్ ప్రాంతంలో చేసుకోవాలన్నారు. ఎవరైనా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలు జరిపితే క్రిమినల్ కేసులు తప్పవన్నారు.



ఉత్తమ అధ్యాపకుడిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం

ధర్పల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బోయిన్‌పల్లి ప్రభాకర్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా కళాశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాం, తెలంగాణ ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ ఫైనాన్స్ సెక్రెటరీ రమేష్ గౌడ్‌లు ప్రభాకర్‌ను సన్మానించారు. విద్యార్థులకు మరింత చక్కగా పాఠ్యాంశాలు అర్థం కావడానికి యూట్యూబ్ వీడియోలు, పీపీటీ తరగతులు తయారు చేశారు. 35జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పత్రసమర్పణ చేశారని ఈ సందర్భంగా వారు కొనియాడారు. 28జాతీయ, అంతర్జాతీయ వెబినార్‌లలో ప్రభాకర్ పాల్గొన్నారని, యూజీసీ గుర్తించిన ప్రామాణిక జాతీయ, అంతర్జాతీయ జనరల్స్‌లో 21పరిశోధన వ్యాసాలు ప్రచురింప బడ్డాయన్నారు. ప్రభాకర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా ఎంపిక కావడం కళాశాల పేరు రాష్ట్రస్థాయిలో నిలిపాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాంచందర్, శ్రీనివాస్ రెడ్డి, కుమారస్వామి, గంగాధర్, రవిరాజ్, సంజీవ్, శారద, పద్మ, సరిత, సంధ్యరాణి, సరళ, నిహారిక, సాయికిరణ్, హబీబ్, ప్రణీత్, దేవిదాస్, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

లొంక రామలింగేశ్వర స్వామి ఆలయంలో సీపీ పూజలు

సిరికొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవిలో గల లొంక రామలింగేశ్వర స్వామిని నిజామాబాద్ అదనపు మేజిస్ట్రేట్, పోలీస్ కమిషనర్ గురువారం దర్శించుకున్నారు. పుష్కరిలో సీపీ స్నానమాచరించి సైకత లింగానికి లింగాష్టకం చదివి వినిపించారు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ.. దట్టమైన అడవిలో రెండు కొండల మధ్యలో వెలిసిన ఆలయ క్షేత్రం చాలా ప్రసిద్ధి చెందిందన్నారు. పచ్చని చెట్లు, నీటి సెలయేళ్లు ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. ఈ సందర్భంగా సీపీని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. సీపీ వెంట ధర్పల్లి సీఐ భిక్షపతి, ఆలయ పండితుడు దండాల నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు గంగాధర్, మారుతి, రాజ్‌కుమార్, లక్ష్మినారాయణ, బీనిల్, రాజ్ గణేష్‌గౌడ్, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

నవోదయ పాఠశాలకు సిరికొండ విద్యార్థులు

సిరికొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన నవోదయ పాఠశాలకు 2025-26 విద్యా సంవత్సరానికి గాను సిరికొండకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. జవహార్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఇటీవల విడుదల చేసిన విద్యార్థుల జాబితాలో సిరికొండ సత్యాశోధక్ పాఠశాలకు చెందిన రాజ్యలక్ష్మి, సల్ల చైత్రలకు చోటు లభించిందని పాఠశాల ప్రిన్స్‌పాల్ ఆర్.నర్సయ్య తెలిపారు.

జిల్లాలో ఉగ్ర కలకలం

(5వ పేజీ తరువాయి)

పావుగా వాడుకునే ప్రయత్నం ఐసీస్ చేసిందా? అనే కోణంలో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు విచారణ చేస్తున్నారు. జిల్లాలో ఉగ్ర మూలాలపై గతంలో అనేక ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో మళ్లీ బోధన్‌లో ఉగ్ర మూలాలు జిల్లా ప్రజలను మరోసారి భయాందోళనలకు గురిచేశాయి

జిల్లాలో స్లీపర్ సెల్స్..

జిల్లాలో ఉగ్ర మూలాలు ఉన్నాయని సంకేతాలకు నగరంతో పాటు బోధన్‌లో గతంలో జరిగిన ఘటనలే నిదర్శనంగా ఉన్నాయి. మనుషులతో కలిసి పోతూ ఉగ్రవాద కార్యకలాపాలకు సహకారం అందిస్తున్న అనేకమంది స్లీపర్ సేల్స్ జిల్లాలో ఉన్నట్లు ఎన్ఐఎ నిఘా తేలింది. గతంలో నగరంలో సంచలనం సృష్టించిన పీఎఫ్ఐ శిక్షణలో ముఖ్యంగా మనుషులను ఏ విధంగా చంపాలి.. అల్లర్లు ఏ విధంగా సృష్టించాలి.. అనే విషయంలో శిక్షణ ఇచ్చినట్లు విచారణలో తేలింది. ఇలా మనతో ఉంటూ మన మధ్య తిరుగుతూ సమయం కోసం వేచి చూస్తూ అల్లలు సృష్టించే వారు అనేకమంది ఉగ్ర లింకులతో సంబంధం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. పీఎఫ్ఐ కరాటే శిక్షణలో 200 మందికి పైగా శిక్షణ తీసుకోగ వారంతా ఇప్పుడు ఎక్కడ ఉన్నారు వారు ఉగ్ర లింకులు ఇంకా కొనసాగిస్తున్నారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేయాల్సిన అవసరం ఈ ఘటనతో మళ్లీ మొదలైంది. కేవలం అరెస్టులు, విచారణ చేసి వదిలేస్తే సరిపోదని ఉగ్ర మూలాలను సమూలంగా తొలగిస్తేనే ప్రజలు ప్రశాంతంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనా జిల్లాలో గతంలో పీఎఫ్ఐ శిక్షణ కదలికలు, బోధన్‌లో దొంగ పాస్ పోర్టుల వ్యవహారం ఇప్పుడు ఉగ్ర లింకులు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు అన్ని కోణాల్లో అనుమానిత వ్యక్తులను విచారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసిన యమన్ తండ్రి రియాజ్ భాషా కాంపౌండర్‌గా పనిచేస్తుండగా గతంలో జింకలు వేటాడిన కేసులో నిందితుడిగా ఉన్నాడు ఇతనికి ఎయిర్ గన్ లైసెన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. కానీ ప్రస్తుతం రియాజ్ భాషాతో యమన్ కుటుంబానికి సంబంధాలు అంతంత మాత్రమే ఉన్న నేపథ్యంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎయిర్ గన్ తండ్రిదా లేక యమన్‌దా తేలాల్సి ఉంది. యమన్ ఇంట్లో బుల్లెట్లు సైతం లభించడంతో అతను తుపాకీ తయారీలో శిక్షణ పొందుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఉగ్ర లింకులతో యమన్‌కు సంబంధం లేదు..

బోధన్ అనీషానగర్‌కు చెందిన మహమ్మద్ హాజీఫ్ యమన్‌కు ఉగ్రవాదులతో ఎలాంటి లింకు లేదని తల్లి నసీం సుల్తానా వాపోయింది. ఆన్‌లైన్‌లో మాత్రమే మాట్లాడని కానీ ఉగ్ర లింకులతో తమ అన్నకు సంబంధం లేదని తమ్ముడు అలీ తెలిపాడు.

సాదా బైనామాలకు రైట్.. రైట్..

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం నుంచి రావాల్సిన రైతుభరోసా, బోనస్, ఇతర లబ్ధిని పొందలేకపోతున్నారు. స్టాంప్ పేపర్, లేదా సాధారణ పేపర్‌పై ఇద్దరిమధ్య రాసుకున్న ఒప్పంద పత్రాలను ఇప్పుడు సాదాబైనామాల ద్వారా క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది. గతంలో రిజిస్ట్రేషన్ లేకపోవడంతో కేవలం పేపర్‌మీద రాసుకున్న ఒప్పందం ప్రకారమే భూములను సాగు చేసుకుంటున్న రైతులు చట్టపరమైన హక్కులను పొందలేకపోతున్నారు. పాస్‌బుక్ లేకపోవడంతో రుణాలు, భూమిని అమ్మడం, కొనడం వంటివి చేయడం ఇబ్బంది కలిగిస్తుంది. ఈ నేపథ్యంలో గతంలో 2016లో జీవో నంబర్ 153ను బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చి 2014 జూన్ 2వ తేదీకి ముందు సాదాబైనామాలతో భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. 2020లో జీవో నంబర్ 112ను జారీ చేసినప్పటికీ ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ధరణి తీసుకురావడంతో సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జీవో నంబర్ 112ను సవాల్ చేస్తూ నిర్మల్‌కు చెందిన షిండే దేవిదాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా దీనిపై విచారణ జరిపిన కోర్టు 2020 నవంబర్ 11న మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం హైకోర్టు సాదాబైనామాలకు క్లియరెన్స్ ఇవ్వడంతో తొమ్మిదేళ్లుగా ఎదురు చూస్తున్న రైతులకు వాటి పరిష్కారం కోసం ఆశలు చిగురిస్తున్నాయి.

పీవోటీ దరఖాస్తులకు సైతం మోక్షం...

పీవోటీ భూములు అనగా పట్టాలేని ప్రభుత్వ భూములుగా లేదా ఇనామ్ భూములుగా అధికారులు పరిగణిస్తున్నారు. వాటిని సాగు చేసుకొని తమ ఆదీనంలో ఉంచుకున్న రైతులు వాటిని తమ పేరు మీదకి క్రమబద్ధీకరించేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సాదాబైనామాలతో పాటు పీవోటీ భూములను క్రమబద్ధీకరించేందుకు సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. రైతులు సాగు చేసుకుంటున్న పీవోటీ భూములు సక్రమం అయితే వాటిని వారి పేరుమీదకు మార్చేందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. పీవోటీ భూములు రైతుల ఆధీనంలో ఉన్నప్పటికీ వాటిని పాస్‌బుక్‌లోకి నమోదు చేయడం ఇప్పటి వరకు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. దీనివల్ల రైతు రుణాలు కానీ, ప్రధానమంత్రి కిసాన్ యోజన, రైతుబంధు, రైతుబీమా వంటి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలు రైతులు కోల్పోతున్నారు. జిల్లాలో 9,233 పీవోటీ దరఖాస్తులు ప్రస్తుతం అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని త్వరగా పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

చదువు మానేసిన వారిని గుర్తించాలి



అదనపు కలెక్టర్‌కు పూలమొక్కను క్రాంతిరెడ్డి

సుభాష్ నగర్, సెప్టెంబరు 11,(ఆంధ్రజ్యోతి) జిల్లాలో మధ్యలో చదువు మానేసిన వారిని గుర్తించి చదువుకునేలా చేయాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్. టాస్ అడ్మిషన్ అబ్జర్వర్ స్టేట్ కోఆర్డినేటర్ క్రాంతి రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లాలోని డ్రాప్‌అవుట్‌ను గుర్తించి చెడు వ్యసనాలకు లోను కాకుండా వారిని పదవ తరగతి ఇంటర్మీడియట్లో అర్హతలకు అనుగుణంగా విద్య నేర్పించడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి ఇది ఒక మంచి అవకాశమని అన్నారు. గడువులోగా జిల్లాకు ఇచ్చిన టార్గెట్ ను పూర్తి చేస్తామని తెలిపారు.

పరిషత్ తుది జాబితా విడుదల

నిజామాబాద్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గలకు (ఎంపీటీసీ, జడ్పీటీసీ) స్థానాలకు సంబంధించి తుది ఫోటో ఓటరు జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ అధికారులు విడుదల చేశారు. జాబితా ప్రకారం జిల్లాలో 8,51,417 మంది ఓటర్లు ఉన్నారు. పురుష ఓటర్లు 3,96,778 మహిళా ఓటర్లు 4,54,621 మంది ఇతరులు 18 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 31 జడ్పీటీసీ స్థానాలకు 37 ఎంపీటీసీ స్థానాలకుగాను 1,563 పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాను ప్రకటించారు. ఈనెల 6న డ్రాఫ్ట్ జాబితాను విడుదల చేయగా 8వ తేదీ జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించారు 9వ తేదీ అభ్యం తరాలను పరిష్కరించి తుది జాబితాను ప్రకటించారు.

సినిమా గైడ్

దేవి : లిటిల్ హార్ట్స్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మిరాయి(11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కొత్త లోక (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : కిష్కింధపూరి (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : మిరాయి (11.00, 10.30)
: కిష్కింధపూరి (1.55,7.30)
: డెమన్ స్లయర్ (ఇంగ్లీష్)(4.30)
స్క్రీన్-2 : లిటిల్ హార్ట్స్ (11.00)
: మిరాయి (1.30,4.30) : కొత్తలోక (7.30)
: డెమన్ స్లయర్ (ఇంగ్లీష్)(10.30)
స్క్రీన్-3 : డెమన్ స్లయర్ (ఇంగ్లీష్)(10.30)
: కొత్తలోక (1.30) : లిటిల్ హార్ట్స్ (4.30,10.30)
: మిరాయి(7.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : లిటిల్ హార్ట్స్ (10.20,1.05)
: మిరాయి (3.50,7.15,10.40)
స్క్రీన్-2 : మిరాయి (10.00, 1.25)
: డెమన్ స్లయర్ (ఇంగ్లీష్)(4.50)
: లిటిల్ హార్ట్స్ (8.05,10.50)
స్క్రీన్-3 :డెమన్ స్లయర్ (ఇంగ్లీష్)(10.10,1.25,7.25)
: కిష్కింధపూరి (4.40,10.40)
స్క్రీన్-4 : కిష్కింధపూరి (10.50)
: ది కంజూరింగ్ లాస్ట్ రైట్స్ (ఇంగ్లీష్) (1.35,7.35)
: కొత్తలోక (4.30,10.30)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,14,200	రూ.1,05,400	రూ.1320

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.265	రూ. 285

